క్లుప్తంగా

జాతీయ పతాకాల పంపిణీ



ఆర్పీలు, వలంటీర్లకు జాతీయ జెండాలు అందిస్తున్న రంధి గోపి

అల్లిపురం: కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటి మీద మూడు రోజుల పాటు జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని వాటిని పంపిణీ చేస్తుంది. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ 33వ వార్డు బంగారుమెట్ట సచివాలయంలో ఆర్పీలు, వలంటీర్లకు జాతీయ జెండాలను వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రంధి గోపి ఆధ్వర్యంలో అందజేశారు.

17 నుంచి సీపీఐ బస్సుయాత్ర



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పైడిరాజు తదితరులు

అల్లిపురం: 'రాష్ట్రాన్ని రక్షించుకుందాం.. దేశాన్ని కాపాడుకుందాం' అనే నినాదంతో ఈ నెల 17 నుంచి సీపీఐ ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు తెలిపారు. అల్లిపురం సీపీఐ కార్యాలయంలో సోమవారం ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 8న తిరుపతిలో నిర్వహించే భారీ బహిరంగ సభతో బస్సుయాత్ర ముగుస్తుందన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగంలో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో మతోన్మాద దాడులు అధికమయ్యాయన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.సత్యాంజనేయ, కసిరెడ్డి సత్యనారాయణ, ఎస్.కె.రెహమాన్, సీఎస్ క్షేత్రపాల్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జేఎస్‌జీ అచ్యుతరావు, అధ్యక్షుడు ఎం.మన్మధరావు పాల్గొన్నారు.

35వ వార్డు సమస్యలు పరిష్కరించండి



కమిషనర్ సాయికాంత్ వర్మకు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ భాస్కరరావు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులోని వివిధ సమస్యలు, అక్రమ ఆశీలు వసూళ్లు, ఇతర సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు కోరారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు ఆయన వినతిపత్రం సమర్పించారు.

కొనసాగుతున్న శ్రావణ సంగీతోత్సవాలు



భక్తిగీతాలు ఆలపిస్తున్న చిన్నారులు

ఎంవీపీ కాలనీ: స్థానిక టీటీడీ కల్యాణ మండపం వేదికగా విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవేంకటేశ్వరస్వామి శ్రావణ సంగీతోత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శ్రీసరస్వతి మ్యూజిక్ అకాడమీ విద్యార్థులు వీణా వాయిద్యంతో చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. మీనాక్షి డ్యాన్స్ అకాడమీ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ మంగళవారం ఉదయం 10 గంటలకు జాతీయ గీతాలాపన, అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ ప్రాముఖ్యతపై వ్యాస రచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తామన్నారు.

జెండా పండగ జోష్



37వ వార్డులో జాతీయ పతాకాలు ప్రదర్శిస్తున్న కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ తదితరులు



మహిళా కళాశాలలో హర్ ఘర్ తిరంగా నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి, విద్యార్థినులు

డాబాగార్డెన్స్: దేశ 77వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థల్లో నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వాటిని జాతీయ జెండాల తోరణాలతో చూడచక్కగా అలంకరించారు. ప్రత్యేక దేశభక్తి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విద్యార్థులు ఉత్సాహంగా ఉన్నారు. మువ్వెన్నల జెండా ఎగురవేసే కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ క్యాడెట్లు చేసే మార్చ్‌పాస్ట్‌కు వారం రోజులుగా తర్ఫీదు పొందారు. క్రీడా పోటీలు, క్విజ్, వ్యాసరచన, దేశభక్తి గీతాల పోటీలు నిర్వహించిన పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు స్వాతంత్ర్య దినోత్సవం రోజున బహుమతులు అందజేయనున్నారు.

జోరుగా విక్రయాలు..

దక్షిణ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ముందే జాతీయ జెండా పండగ వచ్చేసింది. పూర్ణామార్కెట్, స్ప్రింగ్ రోడ్డు, బౌడరా రోడ్డు, వెలంపేట, దుర్గాలమ్మ గుడి జంక్షన్, డాబాగార్డెన్స్, మహారాణిపేట, అల్లిపురం తదితర ప్రాంతాల్లో జాతీయ పతాక విక్రయాలు జోరందుకున్నాయి. ఆయా ప్రాంతాల్లో మువ్వెన్నల జెండాలు వివిధ రూపాల్లో విక్రయిస్తున్నారు. కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాల్లో ఎగురవేసే జాతీయ జెండాతోపాటు వీధుల్లోనూ, ఇళ్ల వద్ద ఎగురవేసే కాగితపు జెండాలు విరివిగా లభిస్తున్నాయి. దుస్తులపై పెట్టుకునే జెండాలు, జెండా ఎగురవేసే రాటకు కట్టే కాగితపు జెండాలు విక్రయిస్తున్నారు. కాషాయి, తెలుపు, ఆకుపచ్చ బెలూన్స్, చేతి బ్యాండ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. వివిధ రకాల చాక్లెట్లు అందుబాటులో ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. ఎక్కడా కూడా ప్లాస్టిక్‌తో రూపొందించిన జెండాలు, హెడ్, హ్యాండ్ బ్యాండ్లు, ఇళ్లకు కట్టుకునే జెండాలను విక్రయాలు జరగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. విక్రయదారులు కూడా కాగితంతో తయారు చేసినవి, క్లాత్ జెండాలను మాత్రమే విక్రయిస్తున్నారు.

మహిళా కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా'

విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో సోమవారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్-హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి విద్యార్థినులు, అధ్యాపకులతో కలిసి జాతీయ జెండా చేతపట్టారు. విద్యార్థులకు దేశ భక్తి, సమాజ సేవ, స్వాతంత్ర్యం గొప్పదనాన్ని వివరించారు. కార్యక్రమ కన్వీనర్ డాక్టర్ ఆర్.కిరణ్మయి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు ఎన్వీ పద్మకుమారి, జ్యోతి, ఎస్.అనురాధ, ఎన్‌సీసీ కో ఆర్డినేటర్లు డాక్టర్ కె.గీతాంజలి, డాక్టర్ కె.సుధ, విద్యార్థినులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ

జీవీఎంసీ 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ వార్డులోని సొసైటీలకు సోమవారం జాతీయ జెండాలు, చాక్లెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు నాయకులు కాసారపు వాసు, యేసు, రేవతి డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎండీకి ఎమ్మెల్యే వాసుపల్లి వినతి



సీఎండీ పృథ్వీతేజ్‌కు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

సీతమ్మధార: గురుద్వారా దరి ఏపీఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో సీఎండీ పృథ్వీతేజ్‌ను సోమవారం దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ కలిశారు. 41వ వార్డు జ్ఞానాపురంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ బాగులేకపోవడంతో తరుచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతోందని ఆయనకు వివరించారు. ఆ వార్డు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ఈ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ముఖ్యంగా జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్స్ మహిళా కళాశాలలో చదువుతున్న విద్యార్థినులు విద్యుత్ సరఫరాలో అంతరాయం వల్ల ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీలైనంత త్వరగా ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ సీఎండీకి ఎమ్మెల్యే వాసుపల్లి వినతిపత్రం అందజేశారు. దక్షిణ నియోజకవర్గంలో మొట్టమొదటిగా రూ.600 కోట్లతో నిర్మిస్తున్న అండర్ గ్రౌండ్ కేబులింగ్‌లో భాగంగా కొన్ని ప్రాంతాల్లో పాత స్తంభాలను తొలగించాలని, తవ్విన గోతులను సక్రమంగా పూడ్చాలని సూచించారు. కొన్ని గోతులను కప్పకపోవడం వల్ల ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. స్పందించిన సీఎండీ మాట్లాడుతూ వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ ఉన్నారు.

'పార్టిషన్ డే'పై ఫొటో ఎగ్జిబిషన్



నాటి ఫొటోలను తిలకిస్తున్న డీఆర్‌ఎం సౌరభ్‌ప్రసాద్

తాటిచెట్లపాలెం: దేశ స్వాతంత్ర్యానికి ముందు రోజు జరిగిన విభజన భయానక దృశ్యాలను గుర్తుచేసుకుంటూ వాల్తేర్ డివిజన్‌లో సోమవారం పార్టిషన్ హారర్స్ రిమెంబరెన్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఫొటోలతో కూడిన ఎగ్జిబిషన్‌ను రైల్వేస్టేషన్ ఫొటో గ్యాలరీ వద్ద సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి నేతృత్వంలో ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌ను డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ ప్రారంభించి, తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యానికి ముందు రోజు భారతీయులు ఎంతో శ్రమ, కష్టాలను అనుభవించారన్నారు. విభజన కారణంగా సుమారు 2 లక్షల మంది ప్రజలు నిరాశ్రయులయ్యారని గుర్తుచేశారు. నాటి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏడీఆర్‌ఎంలు సుధీర్‌కుమార్ గుప్తా (ఇన్‌ఫ్రా), మనోజ్‌కుమార్ సాహూ(ఆపరేషన్స్), ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బుల్లయ్య కళాశాలలో 'గో గ్రీన్'



కళాశాల ఆవరణలో మొక్క నాటి నీరు పోస్తున్న మేయర్ హరివెంకటకుమారి

సీతంపేట: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో రౌండ్ టేబుల్ ఇండియా, లేడీస్ సర్కిల్ ఇండియా ఆధ్వర్యంలో గో గ్రీన్ పేరుతో మెగా ట్రీప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి మేయర్ గొలగాని హరివెంకటకుమారి కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు ముందుకొచ్చి కాలుష్య నియంత్రణపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతి చోటా మొక్కలు పెంచేలా చూడాలన్నారు. గో గ్రీన్‌లో భాగంగా మొక్కలు నాటడం చాలా సంతోషంగా ఉందని, వాటిని సంరక్షించే బాధ్యత కళాశాల యాజమాన్యం తీసుకోవాలన్నారు. బుల్లయ్య కాలేజీ సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ మాట్లాడుతూ ఎకో ఫ్రెండ్లీ క్యాంపస్‌ను నిర్వహించడంతోపాటు కాలుష్య రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు కళాశాల నిబద్ధతను, ముఖ్యంగా విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ యూనిట్లు, సిబ్బందిని, సభ్యులను అభినందించారు. 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, కళాశాల అధ్యాపకులు, పాల్గొన్నారు.

ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని, ఎంపీ ఎంవీవీ, కలెక్టర్ మల్లికార్జున, ఎమ్మెల్యే వాసుపల్లి, డాక్టర్ రవిరాజ్ తదితరులు

మహారాణిపేట: ఆంధ్ర వైద్య కళాశాల(ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాల బ్రోచర్‌ను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని ఆవిష్కరించారు. సోమవారం కేజీహెచ్ ప్రధాన ద్వారం ప్రారంభం అనంతరం ఈ బ్రోచర్‌ను విడుదల చేశారు. శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని రూ.50 కోట్లతో సెంటనరీ బ్లాక్ నిర్మిస్తున్నారు. అక్టోబర్ 23 నుంచి మూడు రోజుల పాటు ఏఎంసీ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు. కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్, ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, రిటైర్డ్ డీఎంఈ డాక్టర్ టి.రవిరాజ్, టి.రాధ, ఏడీ శ్రీనివాస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి నేడు అష్టదళ పద్మారాధన

డాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

ఎస్ఎల్ కెనాల్‌లో పూడిక తీత పూర్తి



ఎస్ఎల్ కెనాల్‌లో ప్రవహిస్తున్న మురుగు నీరు

జగదాంబ: ఎస్ఎల్ కెనాల్‌లో పూడిక తీత పనులు పూర్తి చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రామకృష్ణానగర్‌లోని ఈ కెనాల్ పొంగి ప్రవహించింది. దీంతో పూడికలు తీయాలని 39వ వార్డు కార్పొరేటర్ మహమ్మద్ షాధిక్ కోరారు. అధికారులు స్పందించి పూడిక తీత పనులు చేపట్టారు. గతంలో మాదిరిగా ఎస్ఎల్ కెనాల్‌లో మురుగు నీరు ప్రవహిస్తోంది. కార్పొరేటర్ చర్యలపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దుర్గాగణపతి ఆలయ వార్షికోత్సవం రేపు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట కూడలిలో కొలువైన దుర్గాగణపతి ఆలయ 31వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ తెలిపారు. ఆలయ అర్చకుడు నటరాజన్ మంత్రోచ్ఛారణతో తెల్లవారుజామున 4 గంటలకు దుర్గాగణపతికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, అర్చనలు, హోమాలు జరుగుతాయన్నారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో భక్తులకు స్వామి దర్శనమిస్తారని చెప్పారు. సాయంత్రం 4 గంటలకు 108 కళశాలతో ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కనుల పండువగా జరుగుతుందని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

ఆటో ఢీకొని మహిళకు గాయాలు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆటో ఢీకొని ఓ మహిళకు గాయాలైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఓల్డ్ డైరీఫాం వద్ద నివసిస్తున్న పి.చంద్రశేఖర్ అనే వ్యక్తి సొంత పనుల మీద తన భార్యతో కలిసి ఆదివారం ఉదయం జ్ఞానాపురం వైపు వెళ్తున్నారు. అక్కడి జంక్షన్ వద్దకు వచ్చేసరికి సదరు వ్యక్తికి ఫోన్ రావడంతో బైకు పక్కకు ఆపడానికి ప్రయత్నిస్తున్న క్రమంలో కంచరపాలెం నుంచి వీరికి ఎదురుగా వస్తున్న ఆటో బైకుకు తగిలి అతడి భార్యకు గాయాలయ్యాయి. వెంటనే ఆమెను ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. క్షతగాత్రురాలి భర్త కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రాత్రి ఫిర్యాదు చేయడంతో సీఐ ఎన్.సాయి నేతృత్వంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి

సీతమ్మధార: రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు ఫోర్త్ టౌన్ పోలీసులు చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి వారు తెలిపిన వివరాలిలా.. తాటిచెట్లపాలెం సోనియా గాంధీ నగర్‌లో నివసిస్తున్న మెరంగి కనకరత్నం(55) ఆదివారం ఇంటి నుంచి నరసింహనగర్ రైతుబజార్‌కు వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ ఆమెను చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కనకరత్నం మరణించింది. ఎస్ఐ కె.వెంకటరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మినీ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న విజయనిర్మల

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్-1లో మినీ కన్వెన్షన్ హాల్ నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సోమవారం శంకుస్థాపన చేశారు. వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో రూ.415 లక్షల వ్యయంతో నాలుగు అంతస్తుల్లో ఈ కన్వెన్షన్ హాల్‌ను నిర్మించనున్నారు. తూర్పు నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా ఈ కన్వెన్షన్ హాల్‌ను నిర్మించనున్నట్టు అక్కరమాని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్ ప్రసాదరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్ ఎస్‌వీఎస్ఎస్ రాజు , ఉప కార్యనిర్వాహక ఇంజినీర్ బొట్ట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అందరి కృషితో కాలుష్య నియంత్రణ



ఆటోలో కార్యాలయానికి చేరుకున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి



బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ అందరి సామాజిక బాధ్యతని మేయర్ గొలగాని హరివెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంప్ ఆఫీస్ నుంచి ఆటోలో ప్రయాణించి జీవీఎంసీ కార్యాలయానికి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై కార్యాలయానికి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో వాయు, శబ్ద కాలుష్యం పెరిగిపోయిందని, వాటి నియంత్రణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నగరంలో ప్రైవేట్, ప్రభుత్వ సంస్థల యాజమాన్యాలు వారంలో ఒక్క రోజు ప్రజా రవాణాను వారి సిబ్బందితో ఉపయోగించేలా చూడాలన్నారు. సాధ్యమైనంత వరకు విద్యుత్ వాహనాలు ఉపయోగించాలని మేయర్, కమిషనర్ సూచించారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు

డాబాగార్డెన్స్: ఎందరో ప్రాణత్యాగాల ఫలితంగా ఏర్పాటు చేసుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల సాకుతో ప్రైవేట్‌పరం చేయడం హేయమైన చర్యని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అచ్యుతరావు అన్నారు. పరిశ్రమ మనుగడ, కార్మికుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు. ఏఐటీయూసీ విశాఖ జిల్లా 13వ మహాసభలు ముగిసిన సందర్భంగా సోమవారం స్థానిక పోర్టు యూనియన్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గంగవరం పోర్టులో పనిచేస్తున్న కార్మికులకు పారిశ్రామిక చట్టాలు అమలు చేస్తూ కనీస వేతనాలు చెల్లించాలన్నారు. విశాఖ పోర్టులో బెర్తుల అమ్మకాన్ని నిలపాలని, అసంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి, కార్మిక బోర్డును పటిష్టం చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, నూతన పెన్షన్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నూతన కార్యవర్గం..

ఏఐటీయూసీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా ఎం.మన్మధరావు, గౌరవ అధ్యక్షుడిగా బీసీహెచ్ మసేన్, నిర్వాహక అధ్యక్షుడిగా పడాల రమణ, ఉప ప్రధాన కార్యదర్శిగా బి.వెంకటరావు, కోశాధికారిగా కె.సత్యాంజనేయతోపాటు మరో 69 మంది సమితి సభ్యులుగా, 19 మంది కార్యాలయ బేరర్స్‌గా ఎన్నికైనట్టు ప్రధాన కార్యదర్శి అచ్యుతరావు తెలిపారు.

'మా ఇంటికి వచ్చి చూడండి'పై నేడు ప్రచారం



సమావేశంలో పాల్గొన్న ప్రజ్ఞాన్‌కుమార్ తదితరులు

డాబాగార్డెన్స్: సభ్య సమాజాన్ని, సంఘాలను ఏకతాటిపైకి తెచ్చేందుకు ఈ నెల 15న జాతీయ స్థాయిలో ప్రచారం నిర్వహించనున్నట్టు స్వాంతన డైరెక్టర్ ఎల్.ప్రజ్ఞాన్‌కుమార్ తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మా ఇంటికి వచ్చి చూడండి.. అనే జాతీయ స్థాయి ప్రచారాన్ని వందలాది మంది జాతీయ నెట్‌వర్క్‌లు, లౌకిక, ప్రజాస్వామ్య సమూహాలు, వ్యక్తులు మంగళవారం దేశ వ్యాప్తంగా ప్రారంభించనున్నట్టు చెప్పారు. దేశంలో మనకన్నా భిన్నంగా ఉండే వారిపై ద్వేషం, వివక్ష పెరుగుతోందన్నారు. ఫేక్ న్యూస్‌తో సమాజంలో ఒక వర్గాన్ని కించపరుస్తూ, వారిపై నిజనిర్ధారణ కూడా చేకుండా పుకార్లు పుట్టిస్తుండటం ప్రస్తుత రోజుల్లో మనం చూస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో రాజకీయంగా ప్రేరేపితమైన పుకార్లు మరింత విద్వేషాలను సమాజంలో కల్పించాయన్నారు. ఇటువంటి అపనమ్మకాలు, వివక్షతతో కూడిన వైఖరులను మార్చాలనే.. మా ఇంటికి వచ్చి చూడండి అనే చిరు ప్రయత్నం చేస్తున్నామన్నారు. మన కన్నా భిన్నంగా ఉండే ఇతర కుల, మత, లింగ, భాష, ప్రాంతాల వారిని మన ఇంటికి ఆహ్వానించి.. కాసేపు సరదాగా మాట్లాడుకుంటే పరస్పర విద్వేషాలు తగ్గుతాయని అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ ప్రచారాన్ని విజయవంతం చేసేందుకు విశాఖ నగరంలో పలు ప్రజా సంఘాలు ఐక్యమయ్యాయని, ప్రజలు కూడా ఏకం కావాలని ప్రజ్ఞాన్‌కుమార్ పిలుపునిచ్చారు. సమావేశంలో కె.గ్రేస్, ఎస్.అరుణ, డాక్టర్ సీతల్ తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో ఆర్‌ఎం కార్యాలయం

మద్దిలపాలెం: ఆర్టీసీ స్టీల్ డిపో అధికారులు అవలంబిస్తున్న నిరంకుశ వైఖరికి నిరసనగా బుధవారం ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో చలో రీజనల్ మేనేజర్ కార్యాలయం కార్యక్రమం నిర్వహించనున్నట్టు రీజనల్ కార్యదర్శి నీలకంఠం తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు మధ్యాహ్నం 3 గంటలకు ద్వారకానగర్ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఉన్న ఆర్‌ఎం కార్యాలయానికి తరలిరావాలని ఆయన కోరారు.